# పాఠము

ఒకసంవత్సరము చెన్నపట్టణములో కాపురము చేసి కొత్తబోధన పద్ధతులను నేర్చుకొన్నాను. అవి శల్యగతము లగుటవల్ల మనపూర్వుల విద్యాభ్యాసక్రమము పైన నాకు గౌరవము లేకపోయింది. ఈనేర్చినపద్ధతులన్నీ కొంతమట్టుకు క్లాసులలో ప్రయోగం చేయమొదలు పెట్టాను. కాని దానివిలవ విద్యార్థులు గ్రహించక పోవడంచేత 'ఓగు నోగు మెచ్చు' అనే వేమన్న పద్యం జ్ఞాపకం చేసుకొని మాట్లాడక వూరుకున్నాను. ఈపద్ధతులను ఉపయోగించడానికి సమయము రాక పోతుందా అని ధైర్యం.

ధైర్యం ఎందుచేతనూ అంటే, నాకు మూడేళ్ళ యీడుగల కొడుకు. వాడికి చదువునేర్చుకోవడానికి తగినవయస్సు—అనగా నాలుగుసంవత్సరములు వచ్చినట్లయితే సక్రమంగా పుస్తకాలలో వున్నరీతిగా బోధనపద్ధతులను ప్రయోగించి తద్ద్వారా ఉత్తమవిద్య కరపించవలెనని నే నభ్యసించినమానసికశాస్త్రమును పురస్కరించుకొని పని జరిపినట్లయితే నాకొడుకు ప్రతిభాశాలి అవుతాడని నాధైర్యం.

విద్యాభ్యాసమును ఓనమాలతో మొదలు పెట్టరాదు. వస్తువుల యథార్థగుణగ్రహణము జ్ఞానేంద్రియములు చేస్తున్నవో చేయడం లేదో తెలిసికోవలెను. అట్లు చేయనియెడల వాటిని అభ్యాసపరిచి సరిగా గుణములు గ్రహించేలాగు చేయవలెను. అనగా బాలుడు తొలుదొల్త ఓనమాలను దిద్దుకొనడం మాని వేర్వేరురుచులను దెలిసికొనుట, వేర్వేరురంగులను దెలిసికొనుట, వేర్వేరువాసనలు దెలిసికొనుట, వేర్వేరు శబ్దములు గుర్తుపట్టుట, పదార్థముల వేర్వేరుస్థితులను తాకి తెలిసికొనుట నేర్చుకోవలెను. అట్లు నేర్చుకోవడంవల్ల వారిజ్ఞానేంద్రియాలు వస్తువులయథార్థగుణాలను గ్రహించగలిగి వుంటవి.

ఈవుద్దేశముతో నేను ఒకనాడు నిమ్మకాయ, బెల్లంముక్క, వక్కపొడి, పచ్చిమిరపకాయ ఇత్యాదులు రుచులు నేర్పుటకున్నూ, గన్నేరుపువ్వు, పచ్చగడ్డి, మల్లెపువ్వు, దేవకాంచనము, మసిబొగ్గు, పసుపుకొమ్ము ఇత్యాదులు రంగులు నేర్పుటకున్నూ సంతరించుకొని మావాడిని దగ్గర కూచోబెట్టుకున్నాను. మాఅమ్మ దూరంగా కూచుని పత్తిబుట్ట దగ్గిర పెట్టుకొని వత్తులు చేసుకుంటున్నది.

నేను చదువు చెప్పడం మొదలు పెట్టాను. ఏకాగ్రచిత్తముతో విషయగ్రహణము చేయగలిగి వుండడానికి మావాడిని బాసినపట్టు వేసుకొని కూచోమన్నాను. విద్యాభ్యాససమయాన బాలురిస్వేచ్ఛను అరికట్టడం మంచిపద్ధతి కాదు. అందుచేత బాసినపట్టు వేసుకొమ్మని చెప్పినా మావాడికి స్వేచ్ఛ నేను తగ్గించలేదు. రవంతసేపు బాసినపట్టు రవంతసేపు పండుకోవడం రవంతసేపు మొగ్గలు వెయ్యడం రవంతసేపు గంతులు వెయ్యడం మొదలైనపను లన్నీ చదువు చెప్పుకొనేటప్పుడు మావాడు చేస్తూనే వున్నాడు. మొట్టమొదట గన్నేరుపువ్వు పుచ్చుకొని "నాన్నా, ఇదేమి?" టన్నాను.

"ఇది పువ్వు."

"దీనిపే రేమిటి?"

"దీనిపే రేమిటి నాన్నా?"

"నువ్వు చెప్పు?"

"నువ్వు చెప్పవు నాన్నా?"

"నేను చెప్పకూడదు. నువ్వు చెప్పుకోవాలి."

"నేను చెప్పవచ్చునా నాన్నా?"

"ఆ, చెప్పు."

"నేను చెప్పను, నువ్వే చెప్పుకో నాన్నా!"

"నాకూ తెలియదు. నువ్వు చెప్పు."

"నాకూ తెలియదు. నువ్వు చెప్పు."

"అయితే చెప్పుతాను విను. ఇది గన్నేరుపువ్వు."

"ఇది గన్నేరుపువ్వా నాన్నా?"

"అవును."

"నువ్వు ఎక్కడ తెచ్చావు నాన్నా దీన్ని?"

"దేవాలయం తోటలోంచి."

"నేనూ వెళ్ళి తీసుకురానా నాన్నా?"

"వద్దు. నువ్వు అట్టే మాట్లాడకు. నే చెప్పేది విను."

"మరీ, గన్నేరుపువ్వు ఎందుకు తెచ్చావు నాన్నా?"

"చెప్పుతాను గాని—ఇది ఎలా వుంది?"

"మరి, నా కాపువ్వు ఇవ్వవు నాన్నా?"

"ఇంద పుచ్చుకో, పుచ్చుకొని దానిరంగు ఏమిటో చెప్పుకో."

"దీనిరంగా నాన్నా?"

"అవును. అదిగో రేకులు లాగి వెయ్యకు. ఆలాగ నలిపి వెయ్యకురా!"

"నలపను, గాని ఇంకోపువ్వు ఇవ్వవూ?"

"ఇది అయినతరవాత ఇస్తాను. నే నడిగిప్రశ్నకు సమాధానం చెప్పు."

"ఏమి చెప్పను నాన్నా!"

“దీనిరంగు”

“దీనిరంగా?”

“అవును.”

“నువ్వే చెప్పవు నాన్నా?”

“ఈమాటు నే చెప్పను. నువ్వే చెప్పుకోవాలి.”

“ఏమి చెప్పుకోవాలి నాన్నా?”

“దీని రంగు.”

“అంటే ఏమిటి నాన్నా?”

“ఇది తెలుపా, పసుపా, ఎరుపా, నలుపా చెప్పు.”

“ఇదా నాన్నా?”

“అవును.”

“ఇది తెల్లగా వుంది.”

“ఇది తెల్లగా వుందా? పోనీ యీమల్లిపువ్వెలా వుంది?”

“ఇదా నాన్నా? ఇది ఎం చక్కగుంది!”

“దీనిరంగు?”

“తెల్లగా వుంది.”

“ఈరెండూ తెల్లగానే వున్నాయా?”

“తెల్లగా లేవు నాన్నా!”

“లేవు. గన్నేరుపువ్వు ఎరుపు, మల్లెపువ్వు తెలుపు, మళ్ళీ చెప్పు.”

"ఇది ఎరుపు, ఇది తెలుపు."

"సరే, యీమసిబొగ్గు ఎలా వుంది?"

"ఇదా, యిది ఎర్రగా వుంది."

"ఇది ఎర్రగా వుందిట్రా!"

"మరి ఎలా వుంది నాన్నా?"

"నల్లగా వుంది."

"మసిబొగ్గు నల్లగా వుంది."

"సరే, ఈపచ్చగడ్డి!"

"ఇదీ! ఇది నల్లగా వుంది."

"ఇది మసిబొగ్గులాగ వుందిరా?"

"ఎలా వుంది మరి!"

"ఇది ఆకుపచ్చగా వుంది."

"ఆకుపచ్చగా వుంది."

"సరే, యీమాటు మళ్ళీ చెప్పు. గన్నేరుపువ్వు ఏలా వుంది?"

"ఎర్రగా వుంది."

"మసిబొగ్గు?"

"నల్లగా వుంది."

"మల్లెపువ్వు?"

"ఆకుపచ్చగా వుంది."

"ఆకుపచ్చ కాదు, తెలుపు."

"ఆకుపచ్చ కాదు, తెలుపు"

"పచ్చగడ్డి!"

"పచ్చగడ్డి ఆకుపచ్చ కాదు—"

"ఆకుపచ్చే."

"ఆకుపచ్చగా వుంది."

"సరే. ఇది జ్ఞాపకం వుంచుకుంటావు కాదూ!"

"అలాగే, నాన్నా. నాకా బెల్లంముక్క పెట్టవూ!"

"ఇంద. మరి అదంతా తినెయ్యకు!"

ఇంతట్లో యింటిలోంచి నాభార్య కేక వేసింది.

"అవునుగాని, కచేరీకి వేళయినట్టు వుంది. మీ అమ్మ వుండలేరు. కుర్రాడితో ఆడుకొనేబదులు స్నానం చెయ్యకూడదూ!"

"ఇదిగో లేస్తున్నా."

లేస్తూండగా మాఅమ్మ వత్తులు, వత్తిబుట్టలో పెట్టి మూతవేస్తూ అన్నదిగదా "అబ్బాయీ, ఎప్పటికప్పుడు వాడితో అలాగ ఆడుతావు. వాడికి రెండుముక్కలు చెప్పుతూ వుంటేగాని వాడికి చదువు వచ్చేవిధంఎలాగ?"

మొత్తంమీద ఆడవాళ్ళు— ఏమన డానికీ నోరు రాదు!